నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్కాజిగిరి: వసంతపురి సబ్‌స్టేషన్ 11 కేవీ సాయిరాం ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ గోపాల్ తెలిపారు. మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు యాదవనగర్, మధుసూదన్‌నగర్, ఓల్డ్ మల్కాజిగిరి, గీతానగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఉప్పల్: ఉప్పల్ పారిశ్రామికవాడ ఎగ్‌వుడ్ 11 కేవీ విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉప్పల్ స్టేడియం రోడ్డు, ఐడీఏ మున్సిపల్ కార్యాలయం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, ఏఈ నిఖిల్‌నర్సింగ్‌రావు తెలిపారు. స్టేడియం ఫీడర్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సెంట్రల్ ఇనిస్టిట్యూట్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. 11కేవీ బోడుప్పల్ ఫీడర్ ఉప్పల్ సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు ఉప్పల్ మేయిన్‌రోడ్డు, కుమ్మరి బస్తీ, శ్రీరామకాలనీ, టీఎక్స్ ఆసుపత్రి, భరత్‌నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సఫరా ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా హరీష్‌రావు జన్మదిన వేడుకలు



జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

హబ్సిగూడ: మాజీ మంత్రి హరీష్‌రావు జన్మదిన వేడుకలను బీఆర్‌ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. మంగళవారం డివిజన్‌లోని వెంకట్‌రెడ్డినగర్ బస్టాప్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, ఇతర మాజీలు దేవేందర్‌రెడ్డి, గోలి శ్రీనివాస్‌రెడ్డి, దూదిమెట్ల బాలరాజుయాదవ్, బీఆర్‌ఎస్ నేతలు హాజరై కేక్‌కట్ చేశారు. అనంతరం రక్తదాన శిబిరంలో పాల్గొన్ని రక్తదానం చేశారు.

మసపాక రమేష్‌కు దళితరత్న అవార్డు



దళితరత్న అవార్డు అందుకుంటున్న మసపాక రమేష్

మల్కాజిగిరి: తెలంగాణ దళిత బహుజన సమితి మల్కాజిగిరి ఇన్‌చార్జి మసపాక రమేష్‌కు దళితరత్న అవార్డు వరించింది. ఈ సందర్భంగా సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు గజ్జెల్లి మల్లికార్జున్, ఎస్‌సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడపర్తి రవి మంగళవారం ఆయనకు అవార్డు అందజేశారు. దళితుల సంక్షేమానికి కృషి చేస్తున్న రమేష్‌కు ఈ అవార్డు హర్షణీయమని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో లింగాల కరుణాకర్, వెంకటగిరి, కిషోర్, శ్రవణ్, శంకర్, ప్రవీణ్, రాజు, చంద్రకాంత్ పాల్గొన్నారు.

నేటి నుంచి నల్లపోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

గౌతంనగర్: హిల్‌టాప్‌కాలనీలోని నల్లపోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయని నిర్వాహకులు రఘుకిరాణాచార్యలు తెలిపారు. ఈ ఉత్సవాలు జూన్ 6వ తేదీ వరకు కొనసాగనున్నాయని పేర్కొన్నారు. విగ్రహ ప్రతిష్ఠాపనలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఉప్పల్‌కు నిధులు మంజూరు చేయాలని వినతి

ఉప్పల్: ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలని, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జ్ మందుముల పరమేశ్వర్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ.కర్ణన్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. చాలా ప్రాంతాల్లో రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని, కాప్రా డివిజన్ ఎల్లారెడ్డిగుడలోని కృష్ణానగర్ శ్మశానవాటికలో కనీససదుపాయాలు లేవని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈసీనగర్, బీఎన్‌రెడ్డినగర్, మీనాక్షినగర్, ఆఫీసర్స్ కాలనీ, నాగార్జుననగర్, చిన్నచర్లపల్లి, పెద్ద చర్లపల్లి తదితర ప్రాంతాల్లో సీసీరోడ్డు నిర్మాణం పనులు చేపట్టాలని కోరారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.

మురుగుతో అవస్థలు !

- ఇళ్ల మధ్య నుంచి ఏరులై పారుతున్న వైనం
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- వర్షాకాలంలో సమస్య మరింత జఠిలం



అన్నపూర్ణ సొసైటీ రోడ్డుపై నిల్వ ఉన్న మురుగు

గౌతంనగర్ : ఏళ్ల తరబడి నిత్యం మురుగుతో స్థానిక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సర్వే నెంబర్ 844/1లో సుమారు 8 ఎకరాల్లో అన్నపూర్ణ సొసైటీ ఉంది. మహీంద్రహిల్స్ నుంచి మురుగు ఏరులై పారుతోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బురద, దుర్గంధంతో ఇబ్బంది..

ప్రతిరోజూ బురద, దుర్వాసనతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని, ప్రజలు వాపోతున్నారు. శాశ్వతంగా పరిష్కరించాలని కోరుతున్నారు. వచ్చే వర్షాకాలంలో సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలంటున్నారు.

నిత్యం పొంగుతూ.. ఇళ్లలోకి చేరుతూ..

అన్నపూర్ణ సొసైటీలోని మ్యాన్‌హోళ్లు నిత్యం పొంగుతూ ఇళ్లల్లోకి మురుగు చేరుతుంది. ఎగువ ప్రాంతం కంటోన్మెంట్ నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది. అన్నపూర్ణ సొసైటీ కాలనీ మల్కాజిగిరి నియోగకవర్గం పరిధిలోకి వస్తుంది. దీనిపై అధికారులు ఒకరిపై మరొకరు చెప్పుకుంటూ.. కాలం వెళ్లదీస్తున్నారు.

తీవ్ర ఇబ్బంది పడుతున్నాం..



అన్నపూర్ణ సొసైటీలో ఇళ్ల మధ్య నుంచి రోడ్డుపై కిలోమీటర్ల మేర మురుగు ప్రవహం ఉంటుంది. దీంతో దర్వాసన వెద జల్లుతుండటంతో నరకం అనుభవిస్తున్నాం. అనారోగ్యాల పాలవుతున్నాం.

– గణేష్, అన్నపూర్ణ సొసైటీ

సమస్యను పరిష్కరించండి



అన్నపూర్ణ సొసైటీలో ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరద నీటితో మురుగు కలుషితమై ప్రవహిస్తుంది. దీంతో కాలనీ మొత్తం మురుగునీరే దర్శనమిస్తోంది. వర్షాకాలంలో వరద ప్రవాహం అధికంగా ఉంటుంది. దీనిపై అధికారులు చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలి.

– రవి, స్థానికుడు

జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



అన్నపూర్ణ సొసైటీలో రోడ్డుపై పారుతున్న మురుగు మహేంద్రహిల్స్‌తో పాటు ఎగువ ప్రాంతం నుంచి వస్తుంది. కంటోన్మెంట్ అధికారులు ఒక పైపులైన్‌ను తీసుకొచ్చి దోబిఘాట్ వద్ద వదిలారు. డ్రైనేజీ పైపులైన్‌ను వేయమని జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఆర్‌సీసీ పైపులైన్ వేసేందుకు తగిన చర్యలు తీసుకుంటాం. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తాం.

– దివ్యజ్యోతి, మల్కాజిగిరి సర్కిల్ ఏఈ

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

బోడుప్పల్ కమిషనర్ శైలజ



లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు పత్రాలను అందజేస్తున్న కమిషనర్ శైలజ

బోడుప్పల్: అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని బోడుప్పల్ కమిషనర్ శైలజ అన్నారు. బోడుప్పల్ ఎస్‌ఎస్‌ఎస్ గార్డెన్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... బోడుప్పల్‌లో అర్హులైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు 68 మందిని గుర్తించగా వారికి పత్రాలు అందజేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా హౌసింగ్ బోర్డు అధికారులు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అవగాహన కల్పించారు.

- అనంతరం 14వ డివిజన్‌లో నిర్వహించిన 100 రోజుల కార్యచరణ ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొన్నారు. అందులో భాగంగా ఖాళీ స్థలాలు, పార్కులు, రోడ్లపై చెత్తను తొలగించారు. బ్లూ క్రాస్ వారు కుక్కలను పట్టుకుని కు.ని.కి తరలించారు. ప్రజలకు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. కాలనీలో నీటి నిల్వలు ఉన్నాయని అధికారుల దృష్టికి తీసుకురాగా, వాటిని మోటర్ ద్వారా తొలగిస్తామన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... 100 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో సమస్యలు గుర్తించి వాటికి పరిష్కార మార్గం చూపుతామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, డీఈ చిరంజీవులు మాజీ కార్పొరేటర్లు బొమ్మక్ కళ్యాణ్‌కుమార్, కుంభం కిరణ్‌కుమార్‌రెడ్డి, కొత్త చందర్‌గౌడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల ప్రణాళికను విజయవంతం చేయాలి



పీర్జాదిగూడ కార్పొరేషన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది

మేడిపల్లి: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక రెండోరోజు కొనసాగినట్లు పీర్జాదిగూడ నగర కమిషనర్ త్రిలేశ్వర్‌రావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం ఇంటింటికీ చెత్త సేకరణ వేరుచేయు విధానం, యానిమల్ బర్త్ కంట్రోల్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ట్రేడ్ లైసెన్స్ లేని దుకాణాలను గుర్తిస్తామని అన్నారు. సోషల్ మీడియా, సందేశాలను ప్రజలకు అవగాహన కలిగించే విధంగా కాలర్‌ట్యూన్‌లను ఉపయోగిస్తామని కమిషనర్ త్రిలేశ్వర్‌రావు తెలిపారు. నగర ప్రజలు వంద రోజుల ప్రణాళికను విజయవంతం చేయాలని కమిషనర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

దళితుల భూములను ల్యాండ్ పూలింగ్‌కు తీసుకోవాలి



మంత్రి శ్రీధర్ బాబుకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే, స్థానిక నేతలు

బోడుప్పల్: బోడుప్పల్‌లోని సర్వేనం.63/2 నుంచి 63/25లో ఉన్న దళితుల భూములను ల్యాండ్ పూలింగ్‌కు తీసుకోవాలని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పలువురు దళిత నేతలు మంత్రి శ్రీధర్‌బాబును కలిసి వినతి పత్రం అందజేశారు. గత ప్రభుత్వం 336 ఎకరాలను ల్యాండ్ పూలింగ్ కింద తీసుకుని ఎకరానికి 600 గజాలు చొప్పున ఇచ్చేందుకు ముందుకు వచ్చిందన్నారు. కోర్టులో కేసు వేయడం వల్ల ఆగిపోయిందన్నారు. కావున ఆగిపోయిన ల్యాండ్ పూలింగ్‌ను మరలా పునరుద్ధరించి కేసు వెకేట్ చేయించాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి శ్రీధర్‌బాబు హెచ్‌ఎండీ కమిషనర్, జిల్లా కలెక్టర్‌కు దృష్టికి తీసుకెళ్తానని చెప్పినట్లు వారు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో బోడుప్పల్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి, అంబేద్కర్ సంఘం మాజీ అధ్యక్షులు మీసాల కృష్ణ, కామగల్ల నర్సింమ, చిన్నింగల్ల కుమార్, ప్రధాన కార్యదర్శి చంటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఉప్పరి విజయ్ తదితరులు ఉన్నారు.

కాప్రా సర్కిల్‌లో శానిటేషన్ డ్రైవ్ షురూ



స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ కమిషనర్ జగన్

కాప్రా: రానున్న వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని కాప్రా సర్కిల్ పరిధిలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ను చేపట్టారు. జూన్ 25వ తేదీ వరకు సాగనున్న ఈ స్పెషల్ డ్రైవ్‌ను మంగళవారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్ ప్రారంభించారు. ఈ డ్రైవ్‌ను సర్కిల్ పరిధిలోని అన్ని కాలనీలు, బస్తీల్లో నిర్వహిస్తామన్నారు. కాలనీల్లో పేరుకుపోయిన చెత్త తొలగింపు, నాలాలు, డ్రైనేజీల క్లీనింగ్, దోమల నివారణకు ఫాగింగ్, రోడ్లకిరువైపుల పిచ్చి మొక్కల తొలగింపు, ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాప్రా కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి, ఏఎంహెచ్‌ఓ మధుసూదన్, శానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్, ఎంటమాలజీ ఏఈ రమేష్, యూబీడీ సూపర్‌వైజర్ అజయ్, పారిశుద్ధ్య సిబ్బంది, ఎస్‌ఎఫ్‌ఏలు, జవాన్లు పాల్గొన్నారు.

రామంతాపూర్ కుమ్మర సంఘం నూతన కార్యవర్గం

రామంతాపూర్: కుమ్మర సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నరసింహ, ప్రధాన కార్యదర్శిగా ధరం కుమార్, కోశాధికారిగా రమేష్, ఉపాధ్యక్షులుగా రాజేష్, రాంబాబు, కార్యదర్శులుగా శంకర్, శ్రీనివాస్ తదితరులు ఎన్నికయ్యారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ దయానంద్ నగర్‌కు చెందిన శ్రీనివాస్‌కు సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి మంజూరైన రూ.60 వేల చెక్కును మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆదేశాల మేరకు కాంగ్రెస్ బి–బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్ అందచేశారు. ఈ కార్యక్రమంలో శ్రీను, మాజీ కౌన్సిలర్ ఇంద్ర, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కొనసాగుతున్న రేషన్ పరేషాన్ !



రేషన్ షాప్‌ల వద్ద కొనసాగుతున్న రద్దీ

రామంతాపూర్ : ఉప్పల్ సర్కిల్ పరిధిలోని రామంతాపూర్, హబ్సిగూడ, ఉప్పల్, చిలుకానగర్‌లో ఉన్న 100 రేషన్‌షాపుల్లో జూన్ 1 ఆదివారం ప్రారంభమైన మూడు నెలల రేషన్ పంపిణీ సందర్భంగా కొత్త సాఫ్ట్‌వేర్ కారణంగా ప్రతి లబ్ధిదారుడు తమ 3 నెలల రేషన్ పొందడానికి ఈ– పాస్ మెషిన్‌పై 6 సార్లు బయోమెట్రిక్ వేయాల్సి రావడంతో సర్వర్లు డౌన్ సమస్యలు మూడో రోజు మంగళవారం కూడా కొనసాగాయి. తమ రేషన్ పొందేందుకు లబ్ధిదారుడు దాదాపు 5 గంటల సమయం క్యూలైన్‌లో నిలబడాల్సి వస్తుంది. చేసేదేమి లేక కొంతమంది వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు రేషన్ తీసుకోకుండానే వెనుదిరిగిపోతున్నారు. మరికొంత మంది రేషన్‌డీలర్లతో వాగ్వివాదానికి దిగుతున్నారు. వెంటనే సాఫ్ట్‌వేర్‌ను మార్చివేసి 3 నెలల రేషన్ ఈ– పాస్ మిషన్‌పై ఒకేసారి వేస్తే వచ్చేలా పౌరసరఫరాల శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



వెంకటాపురంలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మర్రి, కార్పొరేటర్ సబిత

అల్వాల్: వెంకటాపురం డివిజన్ బ్యాంకు కాలనీ వీధి నం.2లో సీసీరోడ్డు పనులను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ సబితాఅనిల్‌కిషోర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్కాజిగిరి నియోజకవర్గంలోని అన్ని కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. నియోజకవర్గంలో నెలకొన్న ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అశోక్‌నగర్‌లో మహిళ భవనం ప్రారంభం

వెంకటాపురం డివిజన్ అశోక్‌నగర్ వార్డు కార్యాలయం సమీపంలో మంగళవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ సబితఅనిల్‌కిషోర్‌తో కలిసి మహిళ భవనం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ ఆధునీకరణ పనుల అంచనా వ్యయం సిద్ధం చేయాలి



ఎలక్ట్రికల్ ఎస్ఈకి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ రైల్వే గేటు వద్ద ఆర్‌యూబీ నిర్మాణం కోసం ఎలక్ట్రికల్ ఆధునీకరణకు అయ్యే అంచనా వ్యయం సిద్ధం చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు కోరారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు బీఆర్‌ఎస్ నాయకుడు మేకల రాముయాదవ్ మంగళవారం ఎలక్ట్రికల్ ఎస్ఈ ప్రతిమకు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆమె సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింగ్, కిట్టు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్యను పరిష్కరించండి

అల్వాల్: డివిజన్ పరిధిలోని సంపత్ చిత్తారికాలనీలో మంగళవారం కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. కాలనీలో మురుగు సమస్య ఉందని స్థానికులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ చారి, శేఖర్, ఇమ్రాన్, సాజిద్, శోభన్, జావిద్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ శాంతి

పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

ఉప్పల్: జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు ఉప్పల్ సర్కిల్ పరిధిలో పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు ఉప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు అన్నారు. బస్తీ, కాలనీల్లో చెత్తాచెదారం పేరుకుపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఉప్పల్ చిలుకానగర్, రామంతాపూర్, హబ్సిగూడ తదితర ప్రాంతాల్లో మున్సిపల్ సిబ్బందితో చెత్త తొలగింపు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నాలాల క్లీనింగ్, మ్యాన్ హోల్స్ పొంగకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని చిలుకానగర్ డివిజన్ పరిధిలో కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ప్రారంభించారు. చిలుకానగర్ దాదాపుగా స్లమ్ కావడంతో ఇక్కడ ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు తెలిపారు. స్థానికులు తమ ఇళ్లతో పాటు కాలనీ, బస్తీల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటి ముందు వచ్చే రిక్షావాళ్లకే చెత్తను అందజేయాలని రోడ్లపై వేయొద్దని కోరారు. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య విభాగం అధికారి చందన, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి స్క్రీనింగ్ ఇనిషియేటివ్ మెషిన్

- అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు
- ప్రారంభించిన ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, జిల్లా వైద్యాధికారి డా. ఉమాగౌరి



అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కేన్సర్ స్క్రీనింగ్ మెషిన్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఉమాగౌరి

అల్వాల్: ఇండియన్ ఆయిల్ సంస్థ నిధుల ద్వారా, మహిత స్వచ్ఛంద సంస్థ సహకారంతో దేశంలోనే మొట్టమొదటిసారిగా రేడియేషన్ లేకుండా రొమ్ము కేన్సర్, గర్భాశయ కేన్సర్‌ను తెలుసుకునే అత్యాధునిక స్క్రీనింగ్ ఇనిషియేటివ్ మెషిన్‌ను అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేశారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, జిల్లా వైద్యాధికారి డా. ఉమాగౌరి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల మాట్లాడుతూ.. దేశంలో రోజురోజుకు కేన్సర్ మరణాలు పెరుగుతున్నాయని అన్నారు. అందులో ముఖ్యంగా రొమ్ము, గర్భాశయ కేన్సర్‌తో పాటు ఇతర కేన్సర్‌తో మృత్యువాత పడుతున్నారని పేర్కొన్నారు. కేన్సర్‌ను ముందస్తుగా గుర్తించడానికి వ్యాధి లక్షణాలు కనిపించే ముందే కేన్సర్ కణాలు ఉన్నాయో లేదో తెలుసుకోవడానికి స్క్రీనింగ్ ఇనిషియేటివ్ మెషిన్ ఉపయోగపడుతుందన్నారు. ప్రజలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలో పేదలకు వైద్య పరంగా అన్ని సౌకర్యాలు ఉండే విధంగా కృషి చేస్తానన్నారు.

కేన్సర్‌కి వ్యాక్సినేషన్ టీకాను కూడా అందజేయాలి..

అనంతరం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఇండియన్ ఆయిల్ సంస్థ కేన్సర్ స్క్రీనింగ్ మెషిన్లు అందచేయడం అభినందనీయమని అన్నారు. అదే విధంగా కేన్సర్‌కి వ్యాక్సినేషన్ టీకాను కూడా అందజేయాలని సంస్థ నిర్వాహకులను కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శోభ, ఆరోగ్య కేంద్రం వైద్యురాలు శ్వేత, శైలజ, ఇండియన్ ఆయిల్ సంస్థ సీజీఎం బద్రినాథ్, కైలాష్, అల్వాల్ కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి, మహిత డైరెక్టర్ రమేష్, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆరోగ్య కేంద్రం స్టాఫ్ నర్సులు, సిబ్బంది, ఆశావర్కర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రారంభమైన తెలంగాణ డయాగ్నస్టిక్ మినీ హబ్ సేవలు

అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నూతనంగా నిర్మించిన తెలంగాణ డయాగ్నోస్టిక్ మినీ హబ్‌ను మల్కాజిగిరి వారు కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మినీ హబ్‌లో అల్ట్రాసౌండ్, ఈసీజీ సేవలు అందుబాటులో వచ్చాయన్నారు. ఈ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్



అల్వాల్ పీహెచ్‌సీలో డయాగ్నస్టిక్ మినీ హబ్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, జిల్లా వైద్యాధికారి